
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 మార్చి 2024

5

తూర్పుగోదావరి



తానా కార్యదర్శిగా విద్యాధర్

ప్రజాశక్తి - చాగల్లు



చాగల్లు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ విద్యాధర్ గారపాటి 2023-25 కాలానికి తానా ఫౌండేషన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన 20 ఏళ్లగా అమెరికాలోని న్యూ జెర్సీలో ఉంటూ మూవర్స్ డాట్ కామ్, ఎన్ఆజిఐ గ్రూపులు అధినేతగా వ్యాపారాల్లో రాణిస్తున్నారు. తానా ట్రస్ట్‌గా అందించిన సేవలకు గుర్తింపుగానే ఆయన కార్యదర్శిగాఎన్నికైనట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవలందించారు. కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహణకు సహకరించారు. చదువుకున్న పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. ఆయన తానా కార్యాదర్శిగా ఎన్నికవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభావం చూపుతారా..!



- మళ్లీ రాజకీయ పున ప్రవేశం చేస్తున్న ముద్రగడ
- త్వరలో వైసిపిలో చేరనున్న కాపు ఉద్యమ నేత

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ముద్రగడ అంటే ఒక సంచలనం. ఎన్ని పార్టీలు మారినా, ఎలా వ్యవహరించినా గోదావరి జిల్లాలో ఆయనకో ప్రత్యేక ఇమేజ్ ఉంది. గోదావరి జిల్లాలకే కాదు, ఎపిలోనే సీనియర్ నేతల్లో ఆయన ఒకరు. 1978 లోనే అసెంబ్లీ గడపతొక్కిన నేతల్లో చంద్రబాబునాయుడితో పాటు ముద్రగడ మాత్రమే కొనసాగుతున్నారు. గతంలో ఆయన రాజకీయంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావితం చేసే స్థాయిలో ఉండేవారు. 2009చ 20014 ఎన్నికల్ల వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తరువాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2015 నుంచి 2016 మధ్యలో జరిగిన కాపు ఉద్యమంతో మళ్లీ ఆయన పేరు రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. 2016 జనవరిలో ఆయన హయాంలో తునిలో జరిగిన కాపు ఐక్య గర్జన సభ, రైలు దగ్ధం ఘటనలతో వార్తల్లోకెక్కారు. ఆ తర్వాత కాపు ఉద్యమం ముందుకు సాగిన దాఖలాలు లేవు. దాంతో సుమారు పదేళ్లుగా ఆయన రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. అనేక పరిణామాల అనంతరం ముద్రగడ వైసిపి కండువా వేసుకునేందుకు సన్నద్ధమయ్యారు.

ఈ తరుణంలో ఎన్నికల్లో ఆయన ప్రభావంపై సర్వత్రా చర్చజరుగుతుంది. రాజకీయంగా ఆయన గడచిన ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా ఏ పార్టీకి ఓటు వేయాలన్నది మాత్రం స్పష్టం చేయలేదు. ఈసారి మాత్రం నేరుగా వైసిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 14న తన కుమారుడు గిరితో కలిసి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకోబోతున్నారు.

జనసేన ద్వారా కాపు ఓట్లను దక్కించుకోవాలనే ఆలోచనలో టిడిపి ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టిడిపి ఎత్తుగడకు చెక్ పెట్టడం కోసం ముద్రగడను వైసిపి రంగంలోకి దింపింది. ఆయనకు ఎక్కడా సీటును మాత్రం ఖరారు చేయలేదు. ఈ తరుణంలో జనసేన ఓట్లను వైసిపి వైపు ముద్రగడ ఏ మేరకు మళ్లించగలుగుతారనేది ప్రశ్న. ఒక్కకాపు సామాజికవర్గంలోనే కాకుండా ఇతర సామాజిక వర్గాల్లోనూ ఆయనకు అభిమానులు ఉన్నారు. వారి ఓట్లను ఆయన అధికార పార్టీవైపు ఎలా మళ్లిస్తారో చూడాలి. కోనసీమ ప్రాంతంలో ముద్రగడకు అనుచరులు ఎక్కువ. వారిలో చాలా మంది ఇప్పుడు జనసేనలో ఉన్నారు. వారిని ఆయన ఏ మేరకు ప్రభావితం చేస్తారనేది చూడాలి.

వైసిపిలో చేరిక వాయిదా

ప్రజాశక్తి - కిర్లంపూడి

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైసిపిలో చేరిక వాయిదా పడింది. ఈ మేరకు ఆయన బుధవారం ఒక లేఖను విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 14న తాడేపల్లిలో వైసిపిలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లాలని అనుకున్నామని తెలిపారు. అయితే ఊహించిన దానికన్నా భారీస్థాయిలో స్పందన వచ్చిందన్నారు. సిఎం కార్యాలయం వద్ద సెక్యూరిటీ ఇబ్బందుల కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశానని, దీనికి తనను క్షమించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 15 లేదా 16వ తేదీల్లో తానొక్కడే తాడేపల్లి వెళ్లి ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేరుతానని తెలిపారు. అందరి ఆశీస్సులు కోరుకుంటున్నానని లేఖలో పేర్కొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, డిఆర్ఒ జి.నరసింహులు, రాజమహేంద్రవరం పార్లమెంటు ఎఆర్ఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, ప్రజల ద్వారా వచ్చే ఫిర్యాదులు, వివిధ మాధ్యమాల్లో వచ్చే ప్రతికూల వార్తలు విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ మేరకు తీసుకున్న చర్యల గురించి ఎప్పటికప్పుడు వివరణ ఇస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేతేదీ వరకూ ఫారం 7, 8లను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. 18 ఏళ్ల నుంచి 21 ఏళ్ల మధ్య ఉన్న వారి నుంచి ఫారం 6 దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జనవరి 23 నుంచి నేటి వరకు 11,331 మరణించినవారి ఓటర్లను తొలగించామన్నారు. తుది ఓటరు జాబితా ప్రకటించిన అనంతరం 80,120 ఫారం 6, 7, 8లని స్వీకరించామన్నారు. వాటిలో 73,542 పరిష్కరించామని, ఇంకా 6,578 పెండింగులో ఉన్నాయన్నారు. వాటిలో ఫారం 6కి చెందిన 2,229, ఫారం 7కి చెందిన 2,841, ఫారం 8కి చెందిన 1,508 దరఖాస్తులున్నాయన్నారు. కొత్త ఓటర్లుగా నమోదైన వారికి ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కు ఎలక్షన్ కమిషన్ వెబ్ సైట్ లో పరిశీలించుకునే వెసులుబాటు ఉందన్నారు. జిల్లాకి కొత్తగా లక్షా 70 వేల ఎపిక్ కార్డులు వచ్చాయని, వాటిని ఓటర్లకు అందిస్తామన్నారు.

ఓటు హక్కు కలిగి ఉండి ఎపిక్ కార్డు లేకపోయినా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫొటో ఐడీతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసే అవకాశం ఉందని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఉపాధి హామీ జాబ్ కార్డ్, ఎన్‌పిఆర్ కింద ఆర్‌జిఐ జారీ చేసిన స్మార్ట్ కార్డ్, స్టేట్ బ్యాంక్ లేదా పోస్టాఫీసు నుంచి ఫోటోతో కూడిన పాస్‌బుక్, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఫోటోగ్రాఫ్‌లతో కూడిన సేవా గుర్తింపు కార్డులతో ఓటు వేయొచ్చన్నారు. పిఎస్‌యు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ, ఫోటోగ్రాఫ్‌లతో కూడిన పెన్షన్ పత్రాలు, కార్మిక మంత్రిత్వ శాఖ కింద జారీ చేయబడిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్‌లు లేదా ఎంపీలు/ ఎంఎల్ఎలు/ ఎంఎల్‌సిలకు జారీ చేయబడిన అధికారిక గుర్తింపు కార్డులు చూపి ఓటు వేసే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తేచర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, రాజకీయ పార్టీల ప్రతినిధులు నలబాటి రమేష్, పివి.లక్ష్మి, ఎస్ఎస్ మూర్తి, సిహెచ్.శ్రీనివాస రావు, వైవిఎస్.శ్యామల, ఎలక్షన్స్ డిటి ఎం.సునీల్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సమాజ సేవలోనూ ముందుండాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యార్థులు చదువుతో పాటూ సమాజసేవలనూ ముందుండాలని ఎస్ఐ వి.అప్పలరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో గత నెలలో నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షలో విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.కార్తీక్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించామన్నారు. ముఖ్యఅతిథిగా ఉండ్రాజవరం ఎస్ఐ వి.అప్పలరాజు పాల్గొని బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బహుమతి గ్రహీతలకు అభినందనలు తెలిపారు. విద్యార్థులంతా ఉన్నత చదువులు చదువుకోవాలని, కేవలం చదువులోనే కాకుండా ఈ సమాజంలో జరిగే అన్యాయాల్ని ప్రశ్నిస్తూ చదువుతో పాటు సమాజ సేవలో కూడా ముందుండాలన్నారు. నైపుణ్యాల ఆధారంగా పైకెదగాలని, రానున్న ఫైనల్ పరీక్షలు బాగా రాయాలన్నారు. మొదటి బహుమతి కె.పావని దుర్గాంబ, ద్వితీయ బహుమతి ఆర్.మౌనిక్రశ్రీ, తృతీయ బహుమతి పి.మహేష్‌బాబులతోపాటు టాప్ 10లో మిగిలిన ఏడుగురు విద్యార్థులు జి.నాగలక్ష్మి, ఎన్.విద్య, పి.కళ్యాణి, హర్ష, అంజలి, శారణ్య, రాజ్యలక్ష్మి బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు ఐ.రాంబాబు, హెచ్ఎం వి.విశ్వప్రసాద్, దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు వి.సత్యప్రసన్నకుమార్, పి.గణేష్, జాయింట్ సెక్రటరీ వెంకటేష్, అశోక్, సిద్ధు, విశ్వనాథ్ పాల్గొన్నారు.



విజేతలతో ఎస్ఐ అప్పలరాజు, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

పడాల స్మారక పురస్కారాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు 18వ వర్ధంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 4న సాహితీవేత్తలకు, పలువురు ప్రముఖులకు పడాల స్మారక పురస్కారాలు అందించనున్నామని తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షులు పడాల వీరభద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 6న కేంద్ర సాహిత్య అకాడమీ(న్యూఢిల్లీ), ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగిన పడాల రామారావు శతజయంతి ఉత్సవంలో కొంత మందికి పడాల స్మారక పురస్కారాలు అందించామన్నారు. ఏప్రిల్ 4న పడాల రామారావు వర్ధంతి సందర్భంగా మరికొంత మందికి పురస్కారాలు అందిస్తామని తెలిపారు. వివకరాలకు పడాల వీరభద్రరావు(9493281776)ను సంప్రదించాలన్నారు.

జన ఔషధిలో నాణ్యమైన మందులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజల ఆరోగ్య సంరక్షణలో అధిక ఖర్చులను తగ్గించడం కోసం, తక్కువ ధరలకు నాణ్యమైన మందులను అందించడమే లక్ష్యంగా జన్ ఔషధి కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. బుధవారం హుకుంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బొప్పన సావిత్రమ్మ పాఠశాల పక్కన రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రాన్ని ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ జనఔషధి కేంద్రంలో నాణ్యమైన మందులు తక్కువ ధరలకే దొరుకుతాయన్నారు. డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఇతర మెడికల్ షాపుల రేట్ల కంటే జనఔషధి కేంద్రంలో సరసమైన ధరలకు మందులు అందుబాటులో లభ్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నోడల్ ఆఫీసర్ ఎన్.ఉమారాణి, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, సంఘ ముఖ్య కార్యనిర్వాహణాధికారి బొడ్డేడ రాంబాబు, తొర్రేడు సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకటరావు, స్థానిక నాయకులు చీరా రాజు, ఏలూరి లోకేష్, నక్కా రాజబాబు, రాజవోలు సొసైటీ అధ్యక్షులు గిరిజాల రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న మంత్రి వేణు

డెంగీ పేర దోపిడీ

- ప్లేట్ లెట్స్ సాకుతో రూ.వేలకు వేలు వసూలు
- ప్రయివేటు ఆసుపత్రుల ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రుల్లో డెంగీ పేరుతో రోగులను దోచేస్తున్నారు. వాతావరణ మార్పులతో జిల్లా వ్యాప్తంగా సాధారణ, వైరల్ ఫీవర్లు రోజు రోజుకి పెరుగుతున్నాయి. డెంగీ కేసులు అంటూ ప్రచారం జరగడంతో ప్రజలు హడలి పోతున్నారు. ఈ భయాన్ని కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు క్యాష్ చేసుకుంటున్నాయి. లేనిపోని వైద్య పరీక్షలను నిర్వహిస్తూ రోగుల జేబులు పిండేస్తున్నారు. ఎన్ఎస్-1 పరీక్ష నిర్వహించి పాజిటివ్ రాగానే డెంగీగా నిర్ధారించేస్తున్నారు. కేవలం ఎన్ఎస్-1 పరీక్ష ద్వారా డెంగీ నిర్ధారణ చేయలేమని వైద్య ఆరోగ్యశాఖ అధికారుల చెబుతున్నారే తప్ప, ఆసుపత్రులపై మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోవట్లేదు.



జిల్లాల్లో గడిచిన నెల రోజుల్లో 10 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయి అని గణాంకాలు చెబుతున్నాయి. కాని ప్రయివేటు ఆసుపత్రుల్లో నిత్యం పదుల సంఖ్యలో డెంగీకి సంబంధించిన చికిత్సలను అందిస్తుండడం గమనార్హం. ఎవరైనా జ్వరంతో ఆసుపత్రికి వస్తే అన్ని రకాల పరీక్షల పేరుతో, ఆసుపత్రిలో బెడ్డుకు చార్జీలకు, చికిత్స ప్రారంభించాక అయ్యే ఖర్చుకు హద్దే ఉండడం లేదని పలువురు వాపోతున్నారు.

ప్రజలకు డెంగీపై సరైన అవగాహన లేకపోవడంతో మోసపోతున్నారు. ప్రయివేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లతో కుమ్మక్కై, చిన్నపాటి జ్వరానికి సైతం రక్త పరీక్షలు చేయిస్తున్నారు. కొద్ది మొత్తంలో రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గినా డెంగీకి అందించే చికిత్స మాదిరి చికిత్సలు అందిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఈ తతాంగమంతా కనీసం నిపుణులు కూడా లేని ఆసుపత్రుల్లో ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం.

ప్లేట్‌లెట్స్ చూపించి దోపిడీ

రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోవడాన్ని ప్రధానంగా చూపించి పలు ప్రైవేట్ ఆసుపత్రులు దోచుకుంటున్నాయి. సాధారణంగా ప్లేట్‌లెట్స్ ఒక్క డెంగీ జ్వరంలోనే కాకుండా వైరల్ ఫీవర్స్, చికున్‌గున్యా, రక్త సంబంధిత సమస్యతోనూ తగ్గుతుంటాయని నిపుణులైన వైద్యులు పేర్కొంటున్నారు. అయితే ప్లేట్‌లెట్స్ ఎప్పుడు తగ్గినా అంతప్రమాదకరం కావు. ప్రతీ వ్యక్తి శరీరంలో సాధారణంగా లక్ష నుంచి మూడున్నర లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఆయా సమస్యలు వచ్చినప్పుడు వీటి సంఖ్య కొంత మేర తగ్గినప్పటికీ ప్రాణానికి హాని కలిగేంత స్థాయిలో తగ్గేందుకు అవకాశం ఉండదని పేర్కొంటున్నారు. డెంగీ భారినపడిన వారిలో కూడా 10-20 వేలకు ప్లేట్‌లెట్స్ తగ్గినప్పుడు మాత్రమే ప్రమాదకరమని ప్రభుత్వ వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేట్ ఆసుపత్రుల్లో జ్వరంతో వచ్చిన వెంటనే పరీక్షలు అంటూ అవసరమున్నా లేక పోయినా చికిత్సలు చేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని ఆరోగ్యశాఖ అరికట్టాలని రోగులు వారి బంధువులు కోరుతున్నారు.

అన్ని జ్వరాలూ డెంగీ కాదు...

గడిచిన వారం రోజుల్లో 27 జ్వరాల కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్లు అన్నీ డెంగీ కేసులు కాదు. డెంగీ టైఫాయిడ్ జ్వరాలు గుర్తించినచోట ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నాం. పరిసర ప్రాంతాల్లో శాంపిల్స్ తీసుకుని పరీక్షించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఎంఎస్-1 పరీక్ష నిర్వహించి డెంగీగా నిర్ధారణ చేయకూడదు.

-డాక్టర్ రాజీవ్ జిల్లా ఫీవర్ సర్వే అధికారి

పలుగ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని లక్ష్మీపురం, పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం సిఆర్‌పిఎఫ్ సాయుధ బలగాలతో ఈ కవాతు నిర్వహించారు ఈ సందర్భంగా దేవరపల్లి సిఐ బాలసురేష్‌బాబు మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు, ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు సాయుధ బలగాలతో కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరిరావు, హెచ్‌సి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-దేవరపల్లి

మండలంలో మార్చి 18 నుంచి జరిగే పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒలు ఎం.తిరుమలదాసు, కెఆర్ఎస్‌వివి.అప్పారావు తెలిపారు. బుధవారం ఎంఇఒ కార్యాలయంలో వారు మాట్లాడారు. మండలంలో ఐదు సెంటర్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు దేవరపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్, చిన్నాయగూడెం, ఎర్నగూడెం గ్రామాల్లో జడ్‌పిఉన్నత పాఠశాలలు, దేవరపల్లిలో భాష్యం స్కూలు, శ్రీ చైతన్య స్కూళ్లలో 10వ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 1,199 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. బాలురు 587 బాలికలు 612 మంది ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 74 మంది ఇన్విజిలేటర్లు, పది మంది ఛీఫ్ సూపరింటెండెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమన్నారు. దీన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు.



రూ.2.23 కోట్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామపంచాయతీలో రూ.2.23 కోట్లతో నిర్మించనున్న డ్రెయినేజీలు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారన్నారు. హుకుంపేటలో రూ.45లక్షలు, పిడింగొయ్యిలో రూ.64లక్షలు, ధవళేశ్వరంలో రూ.74 లక్షలు, శాటిలైట్ సిటీలో రూ.40 లక్షలతో ఈ పనులను చేపట్టనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ సంపత్ కుమార్, పలువురు అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



అలా అనకండి సార్..! మనకెవ్వరూ ఓటెయ్యరు!!!

కేశవస్వామి మృతికి గన్ని సంతాపం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సుప్రసిద్ధ వైద్యులు, పేదల డాక్టర్, నీళా జియర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.కేశవస్వామి మృతికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉభయ గోదావరి ప్రజలు ఒక మంచి వైద్యుడిని కోల్పోయారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

టిడిపి రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకునిగా 'చెల్లుబోయిన'

ప్రజాశక్తి-కడియం



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు పార్లమెంటు పరిధిలోని రంపచోడవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకునిగా కడియం మండలం వేమగిరికి చెందిన టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోన్-2 కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ద్వారా ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

'జగనన్న హయాంలో సుపరిపాలన'

ప్రజాశక్తి-నల్లజర్ల

ముఖ్యమంత్రి జగన్ హయాంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని హోం మంతి తానేటి వనిత అన్నారు. బుధవారం నల్లజర్ల మండలం జగన్నాథపురం, మారెళ్లమూడి గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశాలు నిర్వహించారు. తొలుత గ్రామాల్లో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి తానేటి వనితకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. జగన్నాథపురం ఆర్‌సిపిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మారెళ్లమూడిలో సిఎం, హోం మంత్రి ఫ్లెక్సీలకు నిరంతరం పాలాభిషేకం చేయడం పట్ల నాయకులు, కార్యకర్తలను అభినందించారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఆర్‌బికెను ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత

ఇంటర్ పరీక్షకు 226 మంది హాజరు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు శ్రీ వెలగపూడి రామకష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 226 మంది విద్యార్థులు ఎ హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పావని తెలిపారు. ప్లై స్కాట్ వచ్చినట్లు ఆమె తెలిపారు.

నేరాలు ఘోరాలు

130 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 130 కింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేశామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. పిడిఎస్ అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ డిటి తాటిపూడి దివాకర్, పోలీస్ సిబ్బందితో కలిసి గోపాలపురం శివారు పెట్రోల్ బంకు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక వ్యాన్‌లో 130 క్వింటాల పిడిఎస్ రైస్ పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.2.08 లక్షలు ఉంటుందని తెలిపారు. పిఠాపురానికి చెందిన అల్లుమల్లు రామును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్‌లో సారాను విక్రయిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బిఎన్.దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. చైతన్యనగర్‌లో నాటుసారా అమ్ముతున్న పుల్లూరి సితారత్నంను అరెస్టు చేశామని సిఐ తెలిపారు. ఆమె నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచామన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పని ప్రదేశాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపిడిఒ వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎపిఒ, వెటర్నరీ అధికారులతో సమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హార్టికల్చర్ క్రింద ప్రతి గ్రామంలోనూ తోటల పెంపకం, రైతులను గుర్తించాలని, గొర్రెలు, పశువులకు షెడ్లు నిర్మించుకునే రైతులను గుర్తించాలని, వీటన్నింటికీ ఉపాధి హామీ పథకం ద్వారా పేమెంట్లు చేస్తారని తెలిపారు. హౌసింగ్ లబ్ధిదారులకు 90 రోజులకు మస్తర్లు హాజరు నమోదు చేసి మార్చి నెలాఖరుకు వేతనాలు అందచేయాలన్నారు. 2023 -2024 ఆర్థిక సంవత్సరానికి సబంధించి నిర్దేశించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు కల్పించడానికి అవసరమైన పని దినాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌లు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆటో డ్రైవర్‌కు తోటి ఆటో డ్రైవర్లు ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. పెదగాడవిల్లికి చెందిన గాలి శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉంటుండగా ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడు కట్టా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కుంచే రవి, ఆటో డ్రైవర్లు గోడి నాని, గెద్దాడ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్థానిక 15వ వార్డుకు చెందిన కొమ్మిశెట్టి వెంకటేష్, ఇటీవలె మరణించిన దుగ్గిరాల లక్ష్మి కుటుంబాలను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, సిరంగి ఈశ్వరరావు ఉన్నారు.



రోడ్డుపై సెప్టిక్ ట్యాంక్ నీటిలో చిన్నారులు

రోడ్డుపైకి సెప్టిక్ ట్యాంక్ నీరు

ప్రజాశక్తి - అంబాజీపేట

నిత్యం రద్దీగా ఉండే మాచవరం పోతురాజు గుడివద్ద ఒక ఆసామి ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లోని నీటిని ప్రతి రోజూ రోడ్డు పైకి వదులుతున్న దుస్థితి నెలకొన్నా అటు పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమీపంలోని నిత్యం మసీదుకు వెళ్లే ముస్లిములు, నాగమల్లి చెట్టు సమీపంలో ప్రభుత్వ పాఠశాలకు నడిచి వెళ్ళే స్కూల్ చిన్నారులు రహదారిలో సెప్టిక్ ట్యాంక్ నీటిలోనే నడిచి వెళుతున్నారు. వారికి ఏదైనా అంటువ్యాధులు ప్రబలి అనారోగ్యానికి గురైతే దానికి ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుచున్నారు.

ఇంటర్ పరీక్షకు 50 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 50 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.జయ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలైన డాక్టర్ ఎంజిఆర్ కళాశాలలో 301 మందికి 279 మంది హాజరు కాగా 22 మంది, తార కళాశాలలో 206 మందికి 192 మంది హాజరు కాగా 14 మంది, గురుకుల పాఠశాలలో 247 మందికి గాను 233 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని కోరుతూ యానాం డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఆవశ్యకతను ప్రతీ ఓటరు తెలుసుకోవాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీ చిన్నా సెంటర్, పిల్లారాయవీధి, జిప్మర్ సెంటర్ తదితర ప్రధాన వీధుల్లో సాగింది. అలాగే మధ్యాహ్నం ఇవిఎంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ సి.నరేష్, ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పార్కును శుభ్రపరుస్తున్న వాలంటీర్లు

మున్సిపల్ పార్కులో పరిశుభ్రత

ప్రజాశక్తి - యానాం

యానాం అంబేడ్కర్ నగర్‌లోని మున్సిపల్ పార్కును స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ పి.వేలాయుధం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పిఒ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా పేరుకుపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను, తుప్పలను తొలగించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని వాలంటీర్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరీక్షలను సమర్థవంతంగా రాయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పరీక్షలను సమర్థవంతంగా రాయాలని ఎల్ఐసి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి సమతం గన్నయ్య అన్నారు. జాంపేట ప్రభుత్వ ఎస్‌సి బాలికల వసతిగృహంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో ముఖ్యమైందన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇచ్చిన సహకారంతో పరీక్షలను బాగా రాయాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరు బాబురాజేంద్రప్రసాద్, అరవింద్, పి.ఆనంద్‌కుమార్, రాజ్‌కుమార్, హాస్టల్ అధికారి ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

గోకవరం : గోకవరం మండల పరిషత్, పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణాలకు ఎంపిపి సుంకర శ్రీవల్లి బుధవారం శంకుస్థాపన చేశారు. డ్రైవర్స్ కాలనీలోను, మురళి నగర్ లోని, అచ్చియ్య పేట రామాలయం వీధి, అచ్చియ్య పేట రైస్ మిల్ వీధుల్లో వీటిని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరబాబు, పులపర్తి బుజ్జి, తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, చిటికెల పాండు, తాటికొండ సురేష్, బోను రామలక్ష్మి, మేక శ్రీను, గోవింద్, జోగారావు, శివ, వీర్ల వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగన్‌దే...

తాళ్లపూడి : మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతోపాటు సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని 11 గ్రామాలకి చెందిన 1,501 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ అయిన ఇళ్ల పట్టాలను ఆయన బుధవారం పంపిణీ చేశారు. బల్లిపాడులో డివివి.దానయ్య ఎస్టేట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంకా స్థలాలు పొందడానికి అర్హత కలిగిన వారుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, వైసిపి నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

కడియం : కడియం మేకలదిబ్బ సెంటర్లో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతాలను సిడిపిఒ నాగమణి, ఎసిడిపిఒ కనకవల్లి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గర్భిణిగా వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, పిల్లలు, సూపర్‌వైజర్ సత్యశ్రీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు నివాళి

చాగల్లు : కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా బ్రాహ్మణగూడెం ఆరోగ్య కేంద్ర సిబ్బంది నివాళులర్పించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కె.నిశిత, డాక్టర్ పిఆర్ఎల్.దేవి ఆధ్వర్యంలో మొల్ల జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.రామచంద్రం, ఎస్.శారమ్మ, ఎం.రాజశేఖర్, డివి.రామకృష్ణ, పి.శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లు మండలం చిక్కాలపాలెంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సచివాలయ వ్యవస్థతో అట్టడుగున ఉన్న పేదలకు సైతం ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అవినీతి, లంచాలకు అస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సిఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల గౌరవాధ్యక్షులు జుట్టా కొండలరావు, అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు సుంకర రాయుడు, గూడపాటి శివ, కార్పొరేషన్ డైరెక్టర్ సంసాని రమేష్, చిక్కాల సర్పంచ్ కొయ్యే మణి, ఎంపిటిసి సభ్యులు పిల్లి తిరుమలరావు, ఉప సర్పంచ్ తాతా శ్రీహరి, బండి శోభన్‌బాబు, చిటికెన బాబి, వీరవల్లి శ్రీరామచంద్రం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ తలారి వెంకట్రావు



సుమంత్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ బాబు తదితరులు

కిక్ బాక్సింగ్‌లో సుమంత్‌కు రజతం

ప్రజాశక్తి - రాజానగరం

అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ పోటీలు పురుషుల విభాగంలో గైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎ.సుమంత్‌కుమార్ ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.శేఖర్‌బాబు తెలిపారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సుమంత్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బాబు మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగిన ఈ పోటీల్లో జెఎన్‌టియుకె జట్టుకు సుమంత్‌కుమార్ ప్రాతినిధ్యం వహించారన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడని చెప్పారుడీ కార్యక్రమంలో గైట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, వ్యాయామ అధ్యాపకుడు పివి.రమేష్ వివిధ భాగాల అధిపతులు పాల్గొన్నారు.

గాదెలపాలెంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గాదెలపాలెంలో బుధవారం మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం సతీమణి తోట వాణి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్‌ను సిఎంగా, తోట నరసింహాన్ని ఎంఎల్ఎగా చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్లు దాఖలు, పోలింగ్ ప్రక్రియ వంటి అంశాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్లు దాఖలు అనుమతుల మంజూరు సి.విజిల్ యాప్ వినియోగం, హెల్ప్ డెస్క్ క్యూలైన్లు, పోలింగ్ ప్రక్రియ, నామినేషన్లను దాఖలు చేసే విధానాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించారు. ఈ దఫా ఎన్నికల్లో కొత్తగా ఇంటి వద్ద నుండి ఓటింగ్ వేసే అవకాశం 40 శాతం పైబడి వికలాంగత్వం ఉండి సదరం సర్టిఫికెట్లు పొందిన వికలాంగులు, 85 ఏళ్ల వయసు పైబడిన వారు సద్వినియోగం చేసుకునే వెసులుబాటును ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందన్నారు. పార్లమెంటు స్థానం కోసం పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ స్థానంలో పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.40 లక్షలు వరకు ఖర్చు చేసుకొనే అవకాశం ఉందన్నారు. దీనికోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల తరువాత నిర్ణీత గడువులోగా ఖర్చుల వివరాలను తెలియజేస్తామన్నారు. పోలింగ్ రోజున చేసే ఏర్పాట్లు, అధికార బృందాల నియామకం, వాహనాలు సమకూర్చడం, ఇవిఎంలు, మాక్ పోల్, సువిధ, పాలింగ్ రోజు ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్లు, హెూమ్ ఓటింగ్, మోడల్ కోడ్ అమలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ స్టేషన్ ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించే సదుపాయాలు, వ్యయ నియంత్రణ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ ప్రక్రియ మొదలవ్వడానికి ముందే మాక్ పాలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి.ప్యాట్లను కలిపి ఒక ఇవిఎం యూనిట్‌గా పరిగణనిస్తారని, వీటిలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్కటి పని చేయకపోయినా మొత్తం యూనిట్లను మారుస్తారని తెలిపారు. ఒక్క వివి ప్యాట్లో ఏమైనా సమస్య తలెత్తితే మాత్రం, ఆ ఒక్క దానినే మారిస్తే సరిపోతుందని తెలిపారు. ఇవిఎంలతో పాటు టెండర్ ఓట్లను కూడా ప్రతీ పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా అంది స్తారన్నారు. అభ్యర్థుల చేసే ఖర్చుపై వ్యయ పరిశీలకుల నిఘా ఉంటుందని, వీడియో రికార్డింగ్ కూడా చేస్తారని తెలిపారు. ఫిర్యా దుల కోసం 24 గంటలూ పనిచేసే ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు తమ ఆస్తులు, తమపై నమోదై క్రిమినల్ కేసుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను చేసే విధానం, నిబంధనలు, జత పరచాల్సిన తదితర అంశాలను వివరించారు. ఎన్నికలు. ప్రకటించిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటుకు అసెంబ్లీకి పోటీ చేసేవారు ఎన్నికల కమిషన్ నిర్దేశించి నిర్ధేశించిన పారాలతో పాటుగా పూర్తి వివరాలతో ఆపిడవిట్లను సమర్పించాలన్నారు. మొత్తం నామినేషన్ పత్రం ఆరు విభాగాలుగా ఉంటుందన్నారు.. పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.25 వేలను, అసెంబ్లీకి పోలింగ్ పోటీ చేసే అభ్యర్థి రూ.10 వేలను ధరావతు చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు దీనిలో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందని, కుల ధవీకరణ పత్రం. జత చేయాలని సూచించారు

పరీక్షల మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -మామిడికుదురు

ఎపి ఎస్‌సి కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మామిడికుదురులోని బాలురు, బాలికల వసతి గృహాల్లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను విద్యాశాఖధికారులు ఎస్‌విఎస్.లక్ష్మీ నారాయణ, ఎంఇఒ-2 మోకా వెంకన్నబాబు అందజేశారు ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం చిట్టినీడి నిరంజని, బాయ్స్ హాస్టల్ వార్డెన్ ప్రవీణ్ కుమార్, గర్ల్స్ హాస్టల్ వార్డెన్, సంఘం అధ్యక్షులు భూపతి మనోహర్ రాజు , ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాణ్ బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు దొంగ సత్యనారాయణ, సంఘ గౌరవాధ్యక్షుడు పెయ్యల వీరభద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రమేష్ బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బయా మోహనరావు, సభ్యులు తరపట్ల గణపతి, కొనుకు శ్రీనివాసరావు, చొప్పల గోపి, చొప్పల రమేష్ బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.



మెటీరియల్ పంపిణీ చేసిన సభ్యులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ శేఖర్ బాబు కోరారు. అలా కాకుండా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం అమలాపురం మండలం కామనగరువు గ్రామపంచాయతీలో జరిగిన అవగాహన సదస్సుకు గ్రామ సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శేఖర్ బాబు ప్రసంగించారు. ఎన్నికల నియమావళిపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, చొల్లంగి శ్రీను, మెండు ప్రసాద్, పమ్మి తాతాజీ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మండలంలోని గ్రామాలన్నింటినీ దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కషి చేస్తున్నట్టు ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి అన్నారు. గొల్లవిల్లి పంచాయితీ ఇందిరానగర్ దళితపేటలో బుధవారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎంపిపి అచ్యుత జానకి సంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మాజీ ఉపసర్పంచ్ మారిశెట్టి దుర్గారావు, వార్డు సభ్యులు జినిపే మహాలక్ష్మి, నక్కా పద్మశ్రీ, ఎంపిడిఒ కెవి.ప్రసాద్, ఇఒపిఆర్ డికెఎస్.గౌరీ కుమారి, వైసిపి నాయకులు గొలకోటి దొరబాబు, మారిశెట్టి నరేష్, జొన్నాడ చిన్ని పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ఎంఎల్ఎ చిట్టిబాబు

ప్రజాశక్తి -మామిడికుదురు

గెయిల్ పర్యవేక్షణలో కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా సిరపడాలని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు సూచించారు. మామిడికుదురు బోయి బీమన్న మానవ వనరుల కేంద్రంలో గెయిల్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ పొందిన 54 మంది మహిళలకు గెయిల్ సమకూర్చిన 54 కుట్టు మిషను, సర్టిఫికెట్‌లను ఆయన అందచేశారు. పాశర్లపూడిలో కుట్టు శిక్షణ కేంద్రానికి కూడా గెయిల్ సహాయ సహకారాలు అందించాలని ఎంఎల్ఎ కోరారు. ఈ కార్యక్రమంలో తాటిపాక గెయిల్ టెర్మినల్ హెడ్ కె.రాంబాబు, గెయిల్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ మేనేజర్ సురేష్, శిక్షకురాలు కె.రమణి పాల్గొన్నారు.